# ఆడవారికి అలుక ఆనందం

నందగిరి ఇందిరాదేవి

ఆనంద సుధామయ జీవితంలో అలుక ఒక మధురాతి మధురమయిన అనుభవం రాగరంజిత హృదయాలకు ఒక మెరుపుతీగ యౌవ్వన దంపతుల అనురాగ బంధాన్ని చిక్కబరచే ఒక సాధనం అలుక. అలుక, కోపం, ఇంచుమించు ఒకే కోవకు చెందినా కోపంలో కొంచెం ఘాటుగా తనకే శత్రువుగా పరిణమించే అపాయం ఉంది కాని నిర్మలమయిన అలుక స్వచ్ఛమయిన ఆనందాన్నిస్తుంది ఆది కేవలం చనువు, ప్రేమ, అభిమానం, పెనవేసుకున్న వ్యక్తుల మీద ఇట్టేవచ్చి అట్టేపోతుంది కోపం లాగా నిలవవుండకుండా కాని. "ఆడవారికి అలుక ఆనందము" అనే మాటకు ఒక 'కాని' వుంది చూశారో లేదో! మరిట, ఒకాయన పాల వ్యాపారం పెట్టాడట ఆయన ఎంత నిజాయితీపరుడో కాని, "ఇచ్చట పాలు అమ్మబడును" అని బోర్డు వ్రాసి ప్రక్కన బ్రాకెటులో "నీళ్ళు కలిపి" అని వ్రాసుకున్నాడట అట్లా ఆడువారికి అలుక ఆనందము అనే మాటకు ప్రక్కన 'తీర్చే వారుంటే' అని బ్రాకెటులో పెడితే తప్ప ఆ మాట సార్థకం కాదు మరి!

"తీర్చే వారుంటే" అని అనుకోగానే మన కాంతమ్మగారు జ్ఞాపకం వొచ్చి నవ్వొచ్చింది కాంతమ్మగారంటే మీకు తెలుసుగా ఆవిడేనండి — మన ముని మాణిక్యంగారి కాంతమ్మగారు కాంతమ్మగారి భర్తకు ఒకసారి భార్యతో ప్రణయ కలహం పెట్టుకోవాలనిపించిందట ఆవిడకు తోచకపోయినా ఆయనకన్నా తోచింది ఏదో కాస్త సరదాగల మనిషి కాబట్టి అందుకు ఆవిడ సహకారాన్ని అపేక్షించి ప్రణయ కలహం జయప్రదంగా కొనసాగటానికి విధానం అంతా బోధించాడు. ఓపికగా ఆ ఉన్న ఒక్క పడక గదే కోప గృహంగా మార్చమన్నాడు మెళ్లో ఉన్న ఆ ఒక్క గొలుసే ముత్యాల సరాలుగా భావించి తెంపి పోయమన్నాడు అంతా తయారు చేశాక సరే అంటే సరే అన్న కాంతం, ఆయన అసలు ఘట్టంలోకి వచ్చి, "ఓ ప్రియతమా..." అని మొదలు పెట్టేసరికి హడలిపోయి, "ఈయనకు పిచ్చివాగుడు పుట్టిందర్రో" అని రసాభాసం చేసిందట ఎందుకు చెప్పానంటే అలుకలు, ప్రణయ కలహాలు సరిగ్గా సాగాలంటే దంపతుల ఇద్దరి సహకారం అవసరం కాంతం దంపతుల మోస్తరు ముందే అనుకొని అలగకపోయినా కనీసం అలిగినప్పుడన్నా అర్థంచేసుకునే సహృదయం ఉండాలి

సహృదయం మాట ఎట్లావున్నా అందుకు తగిన సరదా, తీరిక కూడా ఉండాలిలెండి ఏదో సందర్భం వొచ్చింది కనుక మనసులో మాట చెపుతున్నా ఆ మాటకొస్తె నాకూ ఉంది అలగా లని ఒక్కసారి ముచ్చటగా, ముద్దుగా, ఒయ్యారంగా, సొంపుగా, సుతారంగా ఒక్క అయిదు నిముషాలు అలుగుదా మనుకుంటే 'ప్చ్' పడటంలేదు ''ఆ ? అంత పనేమిటమ్మా మరీ '' అని అడుగుతారు నాకు తెలుసు అసలు విషయం అది గాదు అలగటానికేం ' అయిదు నిమిషాలుకాదు అరగంట అలగొచ్చు ' కాని అరగంటలో మజా రావాలంటే అసలు తతంగం అంతా అవతల వాళ్ల చేతులో ఉండె ' ''పోనీ పాపం అలిగింది గదా బతిమాలుదాం, అలక తీరుద్దాం" అని అనుకోవద్దూ ' ఏదో ఎప్పుడూ ఇట్లాగే అయిపోతున్నది జీవితంలో ఆ సరదా తీరే దెప్పుడని ఒకసారి తీరిక చేసుకొని లక్షణంగా అలిగి కూర్చున్నాను ఒక సెలవు రోజు రెండు మూడుసార్లు పిలిచినా పలక్కుండా, పిలవగానే హాజరయ్యే మనిషి పలక్కపోతే చీమ కుట్టి నట్టన్నా కాక మా వారు మా పెద్దబ్బాయిని పిలిచి, ''ఒరే బాబూ, మీ అమ్మను పిలవరా,'' అన్నారు పొద్దూకులు ఆ పుస్తకాల్లో తలదూర్చకపోతే "ఏ మయింది'' అని మాట మాత్రంగా నన్నా అడక్కూడదూ ' మా వాడు, ''అమ్మా-నాన్నగారు" అని మాటపూర్తి చేయకముందే ''పోరా'' అని కసిరి కొట్టాను వాడు తిన్నగా వెళ్లి, ''అమ్మకు కోపం వచ్చింది నాన్నా" అని చల్లగా అందిచ్చాడు పోనీ అప్పుడన్నా కనుక్కొ వచ్చుగా అసలు సంగతి ' అహ ' అదేం లేక ''ఓహో ' అయితే పోనీలే ' అని నిర్లిప్తంగా తన పనిలో మునిగి పొయ్యారు ' ఆ క్షణాన కోపం వచ్చినా, "వారికేం తెలుసు ఈ గొడవంతా '' అని సర్దుకొని, ''చెప్పే అలుగుదాం పోనీ'' అనుకున్నాను ఆ సరదామీది మక్కువకొద్ది సూటిగా చెపితే, ''నిన్ను సాగదియ్యటానికి నాకు టైం లేదు'' అని పుల్ల విరిచినట్టు అనేస్తే అసలుకే మోసం వస్తుందని భయంతో, ''సరేలే నువ్వు అలుగు, నే బతిమాలుతాను '' అనే ముక్క వారి చేతనే చెప్పిద్దాం అనుకున్నాను "ఏమండి పారిజాతాపహరణం చదివారా ఎప్పుడన్నా'' అని అడిగాను వారు టకీ మని, "ఏదీ ఆ 'ముల్ల' వ్రాసిందేనా ?" అన్నారు. నాకు చచ్చే నవ్వొచ్చింది సరదా, తీరికా లేని ఈ శాసనాల మనిషితో ఇహ లాభం లేదనుకొని అలగటం ఇప్పట్లో మానుకున్నా నంటె నమ్మండి

సరే, అలిగినా మానినా ఇది మన సంగతి కాని సత్యభామ జన ముద్దుగా అలిగింది ఆమె అలక ఒక మధుర కావ్యంగా రూపొందింది.

"మాసిన చీర కట్టుకొని మౌనముతోడ నిరస్తభూషయై, వాసెన కట్టు కట్టి, నిడువాలిక గస్తురి పట్టువెట్టి, లోగాసిలి చీకటింటికడ కంకటిపై జలదాంత చంద్రరేఖా సదృశాంగియై," ఆరాట పడింది, అలిగింది, తన నాథుడు పారిజాత పుష్పం తన కియ్యలేదని రసికుడయిన గోపాలుడు ఆమె అలుక తీర్చ దలచి, 'వలపుల భరిణా, చిలుకల కొలికీ," అని ముద్దు ముద్దుగా దరిచేర బొయ్యాడు బతిమాలాడు భంగపడ్డాడు అంతకీ లాభం లేక పొయ్యేటప్పటికి ఆమె మృదు పల్లవ కోమల పాదాలకు ఆ యదునందనుడు మొక్కాడు అలుక చెందిన ఆమె ఉచితానుచితాలు తెలుసుకునే పరిస్థితిలో లేక ఆ "జలజాతాసనవాసవాది సుర పూజా భాజనంబై తనర్చు లతాంతాయుధు గన్న తండ్రి శిరమచ్చో వామపాదమున దొలగంద్రోసింది అందుకు కూడ మన్నించి భవదీయ దాసుడను అన్నాడు ఆ కృష్ణమూర్తి చేతులు కట్టుకొని అంతటితో ఆమె కాస్త చల్లబడి ముసుగు తీసి, అలుకకు అసలు కారణం తెలిసి వచ్చేట్టు, "ఈ శుష్కప్రియాలు మాట్లాడకు, నిన్ను నమ్మను" అని అతని మెడకు పడి హృదయంలో ఉన్న బాధంతా పొయ్యేట్టు ఏడ్చేసింది సత్యభామ అప్పుడు చప్పున ఆ నీరజనాభుడు ఆమెను నిండుకౌగిటచేర్చి "ఓసి పిచ్చిదానా' పారిజాతపు పువ్వుకోస్తం ఇంత దిగులెందుకు? ఆ చెట్టే నీ కేళీవనంలో నాటిస్తాను" అని ఓదార్చాడు ఓదార్చటమేకాదు, నాటించాడు కూడా అట్లా సత్యభామ అలిగింది ఆనందం పొందింది

ఇంత సరసమయిన అలుక కొన్ని సమయాల్లో స్వరూపం మారి పట్టుదల, కోపం కింద దుర్వినియోగం అయిపోయింది రాజరాజ నరేంద్రుడు చిత్రాంగిని ప్రాణంతో సమానంగా ప్రేమించాడు ఆమె అలిగిన కారణం తిప్పి చెప్పే వరకు నిజమే ననుకున్నాడు ఆ వృద్ధుడు తత్ఫలితంగా సారంగధరుని కాళ్ళు చేతులు పోయి కధ విషాదాంతం అయింది

దశరధుని ముద్దుల భార్య కైకేయి ఇట్లాగే అలిగింది ఆమె అలిగి కూచోటమే కాక కోరరాని వరాలు కోరి అతన్ని ఇబ్బంది పెట్టింది ఆమె అలుకవల్ల యువరాజు నార చీరలతో అడవికి వెళ్లాల్సి వచ్చింది చివరకు అంతగా ప్రేమించే భర్తనే పోగొట్టుకొంది విచక్షణాజ్ఞానంలేని కైకేయి

ఏదయినా తెగేదాక బిగించకూడదు. ఆ మాట దృష్టిలో పెట్టుకోవాలి అంతే ' అలగటం, ప్రియతముల చేత బతిమాలించుకోటం, 'పనసతొనలకన్న, పంచదారకన్న, జుంటితేనెకన్న, జున్నుకన్న' కూడా మధురమయిన అనుభవం అది అనుభవించటానికి నోచిపుట్టాలి

( —ఆకాశవాణి సౌజన్యంతో )